

"నీ భార్యా మహాపతివ్రత అనుకుంటున్నావు గామాలు. నీ మొహం ఎరక్క మునుపు అది నా దగ్గిరికి ముప్పైమూడుసార్లు వచ్చింది. కాదనమను."

సంతకం లేదు.

అతను సావధానంగా ఉత్తరం చించేసి దీర్ఘాలోచనలో పడ్డాడు.

ఇది ఎవడికీ జరగరాని అనుభవం. మామూలు మనిషి దీనికి తట్టుకోలేడు. పిచ్చివాడైపోతాడు. తను పిచ్చివాడైపోరాదు.

ఆ ఉత్తరంలో ఉన్న విషయం నిజమే అయి ఉండవచ్చు. నిజమని నమ్మి కర్తవ్యం ఆలోచించాలి.

అది రాసినవాడు తనమీది ప్రేమచేత రాయలేదు. తన భార్యమీదా తనమీదా కూడా పగతీర్చుకోనేటందుకు రాశాడు. అంతవరకూ తనూ తన భార్యా ఒకేపక్షం.

తను తన భార్యను చాలా గాఢంగా ప్రేమించాడు.

తను ఎరిగినంతలో ఏ భర్తా భార్యకివ్వనంత స్వేచ్ఛ ఇచ్చాడు.

అది దుర్వినియోగపరచి ఆమె తన్నెప్పుడూ చులకనగా చూడలేదు.

కొడవటిగంటి కుటుంబరావు

ఆమె తనను ప్రేమించింది. ప్రేమించని మనిషి తనకేసి అట్లా చూడలేదు. సంవత్సరంనించీ కాపరం చేస్తున్నా తమ ప్రణయం మెరుపు మాయలేదు. తనమీద ప్రేమ లేకపోతే తను కనిపించగానే పువ్వు వికసించినట్లు ఎట్లా వికసిస్తుంది? తనని చూసుకుని అంత ఎందుకు గర్విస్తుంది?

తనూ అదివరకు—పెళ్ళి కాక పూర్వం—తనకన్న నాలుగేళ్లు పెద్దదైన ఆడదాన్ని ఎరుగును. తను ప్రణయానుభవం పొందిఉండటం లాభించింది.

తన భార్యకూ్కూడా అంతేనేమో!

ఈ విషయం తన భార్యతో చర్చించాలా, వద్దా?

తను ఏ చర్యా తీసుకోకపోతే ఆ ఉత్తరం రాసినవా డూరుకుంటాడా? కులట అని దేశమంతా చాటుతాడు! కులటను పెట్టుకుని కాపురం చేస్తున్న అపఖ్యాతి భరించటం తనకు అసంభవం.

ఇటువంటి భార్య మరొకతె తనకు దొరకదు.

ఆ ఉత్తరం రాసినవాడి ఓర్వలేనితనానికి తను అనుభవించే శిక్ష—తను ఈ భార్యను పోగొట్టుకోవటం.

అత నింటికి రాగానే తల దువ్వుకుంటున్న భార్య చేతులలో, జడ విడిచేసి అతని కెదురొచ్చి గట్టిగా వాటేసుకుని మొహం పైకెత్తింది.

కొంచెం అనుమానించి అత నామెను ముద్దుపెట్టుకున్నాడు. ముద్దు రుచించలేదు. ఇక ఎప్పటికీ ఇంతేనేమో!

"అట్లా ఉన్నారేమండీ?" అన్నది అతని చొక్కా పట్టుకుని పసిపిల్లల్లే లోపలికి నడుస్తూ.

గదిలో పందిరిపట్టెమంచం చూడగానే అతను నిలువునా నీరైపోయినాడు.

తనకేసి వింతగా చూస్తున్న భార్యను గాఢంగా — ధృతరాష్ట్రుడు ఇనప భీముణ్ణి వాటేసుకున్నట్లు - వాటేసుకున్నాడు. ఆమెను పసిపిల్లను ఎత్తినట్లు రెండు చేతుల్లోనూ ఎత్తి మంచం మీద పడేసి తన మొహం ఆమె వక్షానికి గట్టిగా అదుముకున్నాడు....

ఆ ఉద్రేకపు ఉప్పెన తీరిపోగానే అతను మరోమనిషి అయిన ట్టయింది.

"రాత్రి బండికి మీవాళ్ళింటికి పంపేస్తున్నాను! త్వరగా వంట చెయ్యి" అన్నా డతను.

ఆమె తనకేసి చూస్తున్న దని అత నెరుగును. కాని ఆమెకేసి చూడలేకపోయినాడు.

ఆమె తనని ఎందుకనిగాని ఏమిటనిగాని అడగలేదు.

ఏమైనా సంశయం ఉంటే రూఢి అయిపోయింది.

"బండికి వేళౌతున్నది!" అన్నాడతను మరి కొంతసేపటికి.

"ఇవాళ వద్దు. రేపు వెళతాను. తప్పక వెళతాను" అన్నదామె దీనంగా.

"నీ యిష్టం! మరో వాయిదా మాత్రం వెయ్యకు!"

తను ఫోం చేసి పడుకున్నాడు. ఆమె ఫోంచేసి వచ్చింది. కళ్ళు మూసుకుని నిద్రపోతున్నట్టు నటించాడు. ఆమె వచ్చి తేలికగా తన పక్కమీద కూర్చున్నది.

గంట గడిచింది. ఆమె ఇంకా కూర్చునే ఉంది. ఏం చేస్తున్నది? తన కేసి చూస్తున్నదా? ఏం చూస్తోంది? తను మేలుకున్నట్టు తెలిసి ఇదో ఎత్తు వేస్తున్నదా? కళ్ళు తెరిచాడు.

ఆమె చప్పున మంచం మీదినుంచి లేచింది.

"ఏమిటి?" అన్నాడు.

ఆమె మళ్ళీ అతని పక్కనే కూర్చుని, "నన్నొకసారి కావిలించుకోండి. ఇందాకటల్లే" అన్నది.

అతని చేతుల్లో బలమే ఉన్నట్టు లేదు.

అతనికి మూడింతలు బలంతో ఆమె అతన్ని కావలించుకున్నది.

"ఒక్క ముద్దు పెట్టండి?"

ఆమె నోరు సన్నిపాతరోగి శరీరమల్లే కాలిపోతున్నది.

ఆమె భర్తను విడిచి ఎడంగా పోతూ, "లాభం లేదు. బతుకున్నాళ్ళూ చెయ్యాలిసిన పని ఒక్క క్షణంలో చెయ్యటం అసంభవం" అన్నది.

అతనికర్థం కాలేదు.

ఇదంతా తనని మస్కా వెయ్యటం! అమ్మో, ఆడదాని ఎత్తు!

పన్నెండు గంటలవేళ అతనికి కలత నిద్ర పట్టింది. ఆమె మళ్ళీ అతని కేసి చూడలేదు.

అతనికి తిరిగి మెలుకువచ్చేటప్పటికి ఎక్కడో కోడి కూస్తున్నది.

ఆమె పక్కమీద లేదు.

ఆమెకోసం గంటసేపు చూశాడు. రాలేదు.

అతనికి మళ్ళా నిద్ర పట్టింది.

మర్నాడుదయం బావిలో ఆమె శవం కనిపించింది.

---

## సినిమాక్విజ్ - జవాబులు

1. మురళీకృష్ణ
2. పూజాఫలం